సాక్షి పశ్చిమగోదావరి

మంగళవారం । 11 । మార్చి । 2025



ఉద్యోగుల పోరుబాట

సమగ్ర శిక్ష ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం మొండిచేయి చూపుతోంది. ఒప్పందాల అమలుకు ఉద్యోగులు పోరుబాట పట్టనున్నారు. 8లో



పోటెత్తిన భక్తులు

కొల్లేటికోట పెద్దింట్లమ్మ జాతరలో భాగంగా జరిగిన కల్యాణోత్సవానికి వేలాదిగా భక్తులు తరలివచ్చారు. 8లో

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ మంగళవారం (సాయంత్రం)	సహరి బుధవారం (ఉదయం)
భీమవరం	6.18	4.54
నరసాపురం	6.19	4.52
తాడేపల్లిగూడెం	6.14	5.03

న్యూస్‌రీల్

రేపు వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవం



ముదునూరి ప్రసాదరాజు

సాక్షి, భీమవరం: వైఎస్సార్‌సీపీ 14వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఈనెల 12న జిల్లాలో ఘనంగా వేడుకలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు పార్టీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు సోమవారం తెలిపారు. పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు బుధవారం ఉదయం 9 గంటలకు జిల్లాలోని అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో పార్టీ జెండా ఆవిష్కరణలు ఉంటాయన్నారు. అనంతరం కూటమి ప్రభుత్వ మోసంతో నష్టపోతున్న యువత, విద్యార్థులకు బాసటగా నిలిచేందుకు తలపెట్టిన 'యువత పోరు'కు జిల్లా నలుమూలల నుంచి పార్టీ శ్రేణులు భీమవరం చేరుకుంటారని తెలిపారు. ప్రభుత్వ తీరును ఎండగడుతూ భారీ ర్యాలీగా కలెక్టరేట్‌కు చేరుకుని నిరసన కార్యక్రమంలో పాల్గొంటామన్నారు. పార్టీ శ్రేణులు ఆయా కార్యక్రమాలను విజయవంతం చేయాలని ప్రసాదరాజు కోరారు.

నేడు మున్సిపల్ ఆర్డీ సమీక్ష

నరసాపురం: జిల్లాలోని మున్సిపల్ కమిషనర్లు, అధికారులతో మంగళవారం ఉదయం 10 గంటలకు నరసాపురం మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ ఆర్డీ (రాజమండ్రి) సమీక్షా సమావేశం నిర్వహించనున్నారు. నరసాపురం, పాలకొల్లు, తణుకు, తాడేపల్లిగూడెం, ఆకివీడు మున్సిపల్ అధికారులు పాల్గొంటారని నరసాపురం మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య తెలిపారు.

ఇంటర్ పరీక్షలకు 96.9 శాతం హాజరు

భీమవరం: జిల్లావ్యాప్తంగా సోమవారం 52 కేంద్రాల్లో నిర్వహించిన ఇంటర్మీడియెట్ సెకండియర్ పరీక్షలకు 96.9 శాతం విద్యార్థులు హాజరయ్యారు. జనరల్ పరీక్షలకు 13,598 మందికి 13,228 మంది, ఒకేషనల్ పరీక్షలకు 1,535 మందికి 1,441 మంది హాజరయ్యారని డీఐఈఓ ఎ.నాగేశ్వరరావు తెలిపారు.

గోదావరి జిల్లాల్లో ఉప్పునీటి సమస్య

సాక్షి, న్యూఢిల్లీ: పార్లమెంట్ రెండో విడత బడ్జెట్ సమావేశాలు సోమవారం ప్రారంభమయ్యాయి. రాజ్యసభలో వైఎస్సార్‌సీపీ ఎంపీలు కేంద్రాన్ని పలు ప్రశ్నలు అడగ్గా.. కేంద్ర మంత్రులు రాతపూర్వకంగా సమాధానాలు ఇచ్చారు సముద్ర తీర ప్రాంతంలోని తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాలు ఉప్పు సమస్యను ఎదుర్కొంటున్నట్టు కేంద్ర జల్‌శక్తి సహాయ మంత్రి రాజ్ భూషణ్‌చౌదరి తెలిపారు. గుజరాత్, ఆంధ్రప్రదేశ్‌లో సముద్ర తీర ప్రాంతాల్లో ఉప్పు చేరడం వలన అక్కడ పర్యావరణం దెబ్బతింటోందని, ఏయే ప్రాంతాలు ఉప్పు సమస్యను ఎదుర్కొంటున్నాయని వైఎస్సార్ సీపీ ఎంపీ పరిమళ్ నత్వాని ప్రశ్నకు కేంద్ర మంత్రి రాతపూర్వకంగా సమాధానమిచ్చారు. 2012–23 వరకు జాతీయ జలాశయ మ్యాపింగ్ అధ్యయనాల్లో ఏపీలో భూగర్భ జలాలపై అధ్యయనం చేసినట్టు తెలిపారు.

ఇంటర్ పరీక్షలకు 12,485 మంది హాజరు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట) : జిల్లాలోని 55 కేంద్రాల్లో సోమవారం జరిగిన ఇంటర్ సెకండియర్ పరీక్షలకు 12,826 మందికి 12,485 మంది విద్యార్థులు హాజరయ్యారు. వీరిలో 11,022 మంది జనరల్ విద్యార్థులకు 10,809 మంది, 1,804 మంది ఒకేషనల్ విద్యార్థులకు 1,676 మంది హాజరయ్యారని ఇంటర్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి కె.యోహాన్ తెలిపారు.

ఓపెన్ పరీక్షలకు..

ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం (ఓపెన్ స్కూల్) ఇంటర్ పరీక్షలకు సోమవారం 165 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. భౌతిక శాస్త్రం పరీక్షకు 317 మందికి 268 మంది , రాజనీతి శాస్త్రం పరీక్షకు 470 మందికి 354 మంది హాజరయ్యారని డీఈఓ ఎం.వెంకట లక్ష్మమ్మ తెలిపారు.

టెన్త్ విద్యార్థులకు ఉచిత ప్రయాణం

ఏలూరు (ఆర్‌ఆర్ పేట) : పదో తరగతి పబ్లిక్ పరీక్షలు రాసే విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు చేరుకునేందుకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నామని జిల్లా ప్రజా రవాణా అధికారి ఎన్‌వీఆర్ వరప్రసాద్ ప్రకటనలో తెలిపారు. ఏలూరు, జంగారెడ్డిగూడెం, నూజివీడు డిపోల పరిధిలో ఈనెల 17 నుంచి వచ్చేనెల 1 వరకు విద్యార్థులు హాల్‌టికెట్ చూపించి ప్రయాణించవచ్చని, పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు బస్సుల్లో అనుమతిస్తారని పేర్కొన్నారు.

బాబు వచ్చే.. జాబు రాదే?

జాబు కావాలంటే బాబు రావాలన్నారు. ఏటా జనవరి 1న జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామన్నారు. 20 లక్షల ఉద్యోగాలు ఇస్తామన్నారు. పరిశ్రమలు తెస్తామన్నారు. వర్క్ ఫ్రం హోం కోసం హైటెక్ టవర్లు కడతామన్నారు. నిరుద్యోగులకు నెలకు రూ.3 వేలు నిరుద్యోగభృతి ఇస్తామంటూ చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌లు ఎడాపెడా హామీలిచ్చేశారు. తల్లికి వందనం అన్నారు. పది నెలల పాలనలో కొత్త ఉద్యోగాలు ఇవ్వకపోగా ఉన్న వాటిని తొలగిస్తున్నారు. ప్రభుత్వ తీరును నిరసిస్తూ యువత, విద్యార్థుల పక్షాన 12వ తేదీన వైఎస్సార్ సీపీ 'యువత పోరు' నిర్వహించనుంది.

కూటమి దగా

- జనవరి 1నే జాబ్ క్యాలెండర్
- 20 లక్షల ఉద్యోగాలు ఇస్తామని చంద్రబాబు హామీ
- పది నెలల్లో ఒక్క జాబూ ఇవ్వలేదంటున్న నిరుద్యోగులు
- ఉద్యోగాల కోసం వేలాది మంది ఎదురుచూపులు
- వలంటీర్లు, చిరుద్యోగుల పొట్టగొట్టిన కూటమి సర్కారు
- నిరుద్యోగులకు బాసటగా రేపు వైఎస్సార్‌సీపీ 'యువత పోరు'



సాక్షి, భీమవరం: జిల్లాలో దాదాపు ఎనిమిది ఇంజినీరింగ్ కళాశాలలు, 55 వరకు డిగ్రీ కళాశాలలు, పాలిటెక్నిక్, వృత్తివిద్యా కోర్సుల కళాశాలలు ఉన్నాయి. వేలాది మంది విద్యార్థులు వీటిలో చదువుకుంటున్నారు. ఇప్పటికే డిగ్రీ, ఇంజినీరింగ్ పూర్తిచేసి డీఎస్సీ, గ్రూపు పరీక్షలు, పోలీస్ రిక్రూట్‌మెంట్, ఏపీపీఎస్సీ తదితర కొలువుల కోసం ప్రయత్నాలు చేస్తున్న వారు వేలల్లో ఉన్నారు. తమ బిడ్డల భవిష్యత్తు కోసం అయినకాడికి అప్పులు చేసి కోచింగ్ సెంటర్లలో శిక్షణ ఇప్పిస్తున్న తల్లిదండ్రులు ఎందరో. ఉన్నత చదువులు చదివి కుటుంబ ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో అరకొర జీతంపై స్థానికంగా, ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లి వ్యాపార, ప్రైవేట్ సంస్థల్లో పనిచేస్తున్న వారి సంఖ్య లక్షల్లో ఉంటుంది. వీరిలో ఎంతోమంది తమ చదువుకు తగ్గ ఉద్యోగం కోసం చూస్తున్నారు.

హామీల ఊసే లేదు

కూటమి అధికారంలోకి వచ్చాక జాబ్ క్యాలెండర్, నిరుద్యోగభృతి హామీలను ప్రభుత్వం విస్మరించింది. ఈ పథకం అమలుకు వార్షిక బడ్జెట్‌లో కేటాయింపులు చేయకపోవడం గమనార్హం. 16 వేల పోస్టులతో డీఎస్సీ ప్రకటించినా షెడ్యూల్ విడుదల చేయకుండా విద్యాసంవత్సరం కాలయాపన చేసేశారు. 20 లక్షల ఉద్యోగాల ఊసే ఎత్తడం లేదు.

రోడ్డున పడేసి.. ఉన్న జాబులు పీకేసి..

కొత్త ఉద్యోగాలు ఇవ్వకపోగా ఉన్న వాటిని తొలగించే పనిలో కూటమి ప్రభుత్వం ఉంది. వలంటీర్ల జీతం రూ.10 వేలు చేస్తామని చెప్పి వారిని విధుల్లోకి తీసుకోకుండా పక్కన పెట్టేయ్యడంతో జిల్లాలో 9,547 మంది వలంటీర్లు సేవలకు దూరమయ్యారు. ప్రైవేట్ మద్యం పాలసీతో ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పనిచేసిన 893 మంది ఔట్‌సోర్సింగ్ సిబ్బంది రోడ్డున పడ్డారు. కక్ష సాధింపుల్లో భాగంగా పలువురు ఔట్ సోర్సింగ్ సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్లపై వేటు వేశారు.

రూ.158.8 కోట్ల మేర బకాయిలు

పాత బకాయిలు, ప్రస్తుత విద్యాసంవత్సరానికి గాను జిల్లాలోని 31,412 మంది విద్యార్థులకు సంబంధించి సుమారు రూ.158.8 కోట్ల మేర విద్య, వసతి దీవెన పథకాల బకాయిలు చెల్లించాల్సి ఉంది. ఆయా పథకాల పేర్లు మార్చిన ప్రభుత్వం నిధులివ్వక కళాశాలలకు ఫీజులు చెల్లించేందుకు తల్లిదండ్రులు ఇబ్బందులు పడుతున్నారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో భరోసా

గత వైఎస్సార్‌సీపీ నిరుద్యోగులు, విద్యార్థులకు అండగా నిలిచింది. అమ్మఒడి పథకం ద్వారా ఐదేళ్లలో జిల్లాలోని 1,48,342 మంది తల్లుల ఖాతాలకు రూ.887.9 కోట్లు జమ చేశారు. జిల్లాలోని 1,77,996 మంది విద్యార్థులకు జగనన్న విద్యాదీవెన పథకం కింద రూ.485.33 కోట్లు, వసతి దీవెన పథకం కింద 1,76,142 మందికి రూ.163.41 కోట్లు సాయం అందించింది. నిర్దేశిత సమయంలో ప్రభుత్వం ఫీజులు అందించడంతో తల్లిదండ్రులు నిశ్చింతగా ఉండేవారు.

రేపు వైఎస్సార్‌సీపీ 'యువత పోరు'

యువత, విద్యార్థులను కూటమి ప్రభుత్వం చేస్తున్న అన్యాయాన్ని ఎండగడుతూ వారి పక్షాన బుధవారం 'యువత పోరు' నిర్వహించేందుకు వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఎన్నికల హామీలను అమలుచేయాలని డిమాండ్ చేస్తూ యువత, విద్యార్థులతో కలిసి భీమవరంలోని కలెక్టరేట్‌కు పార్టీ శ్రేణులు భారీ ర్యాలీగా తరలివెళ్లి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేయనున్నారు.

జాబ్ క్యాలెండర్ ఊసే లేదు



జనవరిలోనే జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తానని నారా లోకేష్ యువ గళం పాదయాత్రలో ఆర్భాటంగా ప్రకటించారు. ఎన్నికల్లో సైతం హామీలు ఇచ్చారు. అయితే ఇప్పటివరకూ జాబ్ క్యాలెండర్ ఊసే ఎత్తడం లేదు. నిరుద్యోగ భృతి సైతం మరిచిపోయారు. నిరుద్యోగులను కూటమి ప్రభుత్వం మోసం చేసింది.

–సుంకర సీతారాం, కొడమంచిలి

నిరుద్యోగ భృతి ఎప్పుడో?



సూపర్ సిక్స్‌లో భాగంగా నిరుద్యోగ భృతి కింద నెలకు రూ.3 వేలు ఇస్తామన్నారు. ఈ పథకాన్ని ఇప్పటివరకూ అమలు చేయలేదు. చదువులు చదివి ఉద్యోగం లేక ఇబ్బందులు పడుతున్నాం. కుటుంబ భారం పెరుగుతోంది. కూటమి ప్రభుత్వం నిరుద్యోగ భృతి అందించి నిరుద్యోగులను ఆదుకోవాలి. ఆ దిశగా ప్రభుత్వం ముందు అడుగు వేయాలి.

– ఎ.త్రినాథ్, నిరుద్యోగి, తాడేపల్లిగూడెం

యువతకు మోసం



చంద్రబాబు 2014 ఎన్నికల్లోనూ నిరుద్యోగ భృతి అంటూ మోసం చేశారు. మరలా గత ఎన్నికల్లోనూ ఈ హామీ ఇచ్చారు. సూపర్‌సిక్స్ హామీలతో అధికారం చేపట్టి తొమ్మిది నెలలు గడిచినా ఇప్పటివరకూ నిరుద్యోగ భృతి ప్రస్తావన లేదు. ఇలా మోసపూరిత వాగ్దానాలతో యువతను మోసం చేయడం సమంజసం కాదు.

–పొలపర్తి సందీప్, ఏనుగువానిలంక

అంగన్‌వాడీలపై నిర్బంధం అమానుషం



బుట్టాయగూడెం: అంగన్‌వాడీ కార్యకర్తలను అడ్డగించిన దృశ్యం



పాలకొల్లు సెంట్రల్ : రైల్వేస్టేషన్ వద్ద అంగన్‌వాడీ కార్యకర్తల ఆందోళన

నరసాపురం: సమస్యల పరిష్కారం కోరుతూ ప్రజాస్వామ్యయుతంగా ఆందోళనకు వెళుతున్న అంగన్‌వాడీ కార్యకర్తలను అడ్డుకుని నిర్బంధించడం అమానుషమని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముచ్చర్ల త్రిమూర్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం విజయవాడలో మహా ధర్నాకు నరసాపురం నుంచి పెద్దెత్తున బయలుదేరగా ఉదయం 10 గంటలకు రైల్వేస్టేషన్‌కు చేరిన అంగన్‌వాడీలను పోలీసులు అడ్డగించి, వెనక్కి పంపించేయడం దారుణమన్నారు. దీనిపై ఆగ్రహించిన అంగన్‌వాడీలు నోటికి నల్లగంతలు కట్టుకుని పట్టణంలో నిరసన ర్యాలీ చేపట్టారు.

పాలకొల్లులో..

పాలకొల్లు సెంట్రల్: అంగన్‌వాడీలను నిర్బంధించడం దారుణమని సీఐటీయూ నాయకుడు జవ్వాది శ్రీనివాసరావు అన్నారు. పాలకొల్లులో పలువురిని ఇళ్ల వద్దే కాకుండా, రైల్వేస్టేషన్ వద్ద సుమారు 100 మంది అంగన్‌వాడీలను నిర్బంధించడంపై మండిపడ్డారు. అంగన్‌వాడీలు రైల్వేస్టేషన్ వద్ద బైఠాయించి నిరసన తెలిపారు. ప్రభుత్వ చర్యలను ఎండగట్టారు.

సీనియర్లకు మరో సారీ

- ఎమ్మెల్యే సీటు త్యాగం చేసిన నేతలకు మొండిచేయి
- నామినేటెడ్ పోస్టుల భర్తీలోనూ దక్కని అవకాశం



తోట సీతారామలక్ష్మి



మాధవనాయుడు



వలవల బాబ్జీ

సాక్షి, భీమవరం: ఎమ్మెల్సీ పదవిపై గంపెడాసతో ఉన్న జిల్లాలోని కూటమి సీనియర్ నేతలకు చుక్కెదురైంది. ఐదు ఎమ్మెల్సీ స్థానాల్లో వీరికి అవకాశం దక్కలేదు. అధినేత మాటకు కట్టుబడి మిత్రపక్ష అభ్యర్థిని ఎమ్మెల్యేగా గెలిపిస్తే తమకు గుర్తింపు లేకుండా పోయిందన్న ఆవేదనలో వారంతా ఉన్నారు. జిల్లాలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు గాను కూటమి సీట్ల సర్దుబాటులో ఆచంట, తణుకు, పాలకొల్లు, ఉండి నియోజకవర్గాలు టీడీపీ, భీమవరం, నరసాపురం, తాడేపల్లిగూడెంలలో జనసేన పోటీచేశాయి. దీంతో ఆయా నియోజకవర్గాల్లోని మిగిలిన రెండు పార్టీల నుంచి సీట్లు దక్కని ఆశావహులకు ఎమ్మెల్సీ, నామినేటెడ్ పదవులతో సముచిత స్థానం కల్పిస్తామని చంద్రబాబు, పవన్‌కల్యాణ్ భరోసా ఇచ్చారు. తాడేపల్లిగూడెంలో టీడీపీ నుంచి టికెట్ ఆశించిన వలవల బాబ్జీ, నరసాపురంలో టీడీపీ మాజీ ఎమ్మెల్యే బండారు మాధవనాయుడు, ఎన్ఆర్ఐ కొవ్వలి యతిరాజరామ్మోహననాయుడు, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పొత్తూరి రామరాజు, భీమవరంలో టీడీపీ నేత తోట సీతారామలక్ష్మి, జనసేన జిల్లా అధ్యక్షుడు కొటికలపూడి గోవిందరావు, ఉండి నియోజకవర్గంలో జనసేన ఇన్‌చార్జి జుత్తుక నాగరాజు, పాలకొల్లులో జనసేన ఇన్‌చార్జి బోనం చినబాబు తదితర నేతలతో అప్పట్లో సంప్రదింపులు జరిపారు. వీరిలో వలవల బాబ్జి, బండారు మాధవనాయుడు, తోట సీతారామలక్ష్మికి ఎమ్మెల్సీ పదవులు ఇస్తారని అప్పట్లో చంద్రబాబు హామీ ఇచ్చినట్టు చర్చ జరిగింది.

మదనపడుతూ..

ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీ స్థానాల కోసం ఆయా పార్టీల్లో సీనియర్లు ఎదురుచూస్తున్నారు. అయితే వీరికి నిరాశే ఎదురైంది. భీమవరానికి చెందిన బీజేపీ సీనియర్ నేత పాకా సత్యనారాయణ గతంలో ఎంపీ టికెట్ ఆశించారు. ప్రస్తుతం ఎమ్మెల్సీ రేసులో ఉన్నారన్న ప్రచారం జరిగింది. అయితే ఆయనకు పదవి రాకపోవడం వెనుక స్థానికంగా పలు శక్తులు పనిచేశాయన్న ప్రచారం జరుగుతోంది. కూటమి అధికారంలోకి వచ్చాక రెండు విడతల్లో నామినేటెడ్ పోస్టులు భర్తీ చేయగా వాటిలోనూ తమ పేర్లు ప్రస్తావనకు రాకపోవడంతో పలువురు నేతలు అసంతృప్తితో ఉన్నట్టు తెలుస్తోంది. ప్రతిపక్షంగా ఐదేళ్ల పాటు పార్టీని నెట్టుకుని వస్తే అధికారంలోకి వచ్చాక పదవులను మరొకరు ఎంజాయ్ చేస్తున్నారని సీనియర్లు మదనపడుతున్నట్టు సమాచారం.

సునీల్‌కుమార్ సస్పెన్షన్‌పై నిరసన

ఏలూరు (టూటౌన్) : డీజీ పీవీ సునీల్‌కుమార్‌ను అక్రమంగా సస్పెండ్ చేయడంపై ఎస్సీ, ఎస్టీ, బీసీ న్యాయవాదులు స్థానిక జిల్లా కోర్టు ఆవరణలో సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా న్యాయవాదులు మాట్లాడుతూ సునీల్‌కుమార్‌ను సస్పెండ్ చేయడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. దళితులపై, దళిత అధికారులపై కక్ష పూరిత చర్యలు తీసుకోవడం మంచిదికాదన్నారు. తక్షణమే ప్రభుత్వం సునీల్‌కుమార్ సస్పెన్షన్‌ను రద్దు చేసి ఆయన్ను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కోరారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం దళిత అధికారులపై కక్ష సాధింపు చర్యలు ఇకనైనా మానుకోవాలని ముక్తకంఠంతో నినదించారు. న్యాయవాదులు టి.అజిత్ రాజు, జీటీ స్వామి, చదలవాడ రమణ, జి.విజయభాస్కర్, నున్న నాగేశ్వరరావు, ఎం.రవీంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.

భీమవరంలో 'యూత్ పార్లమెంట్'



వికసిత్ భారత్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ నాగరాణి


భీమవరం (ప్రకాశంచౌక్): పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాల స్థాయి వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్–2025 నిర్వహణకు నోడల్ కాలేజీగా భీమవరం డీఎన్నార్ కాలేజీ ఎంపికైందని కలెక్టర్ సీహెచ్ నాగరాణి తెలిపారు. సోమవారం కార్యక్రమ వాల్‌పోస్టర్‌ను ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ రెండు జిల్లాల నుంచి 18 నుంచి 25 ఏళ్లలోపు యువత పాల్గొనవచ్చన్నారు. నమోదు చేసుకున్న వారిలో 150 మందిని స్క్రీనింగ్ చేసి పోటీలు నిర్వహిస్తామని, ప్రతిభ కనబర్చిన 10 మందిని రాష్ట్రస్థాయికి ఎంపిక చేస్తామని చెప్పారు. ఈనెల 16వ తేదీ రాత్రి 11.59 నిమిషాల వరకు పేర్ల నమోదుకు అవకాశం ఉందన్నారు. మరిన్ని వివరాలకు సెల్ 8179179899, 9441388058 నంబర్లలో సంప్రదించాలని సూచించారు. డీఎన్నార్ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు ఎస్.అనిల్‌దేవ్, కె.సోమయ్య, ఈ.భరత్ రాజు, పీడీ ఆర్.సతీష్ పాల్గొన్నారు.

యువత జీవితాలతో కూటమి చెలగాటం

- మాజీ మంత్రులు కారుమూరి, కొట్టు
- 12న వైఎస్సార్‌సీపీ యువత పోరుకు సిద్ధం



తాడేపల్లిగూడెంలో పోస్టర్లు ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ



తణుకులో పోస్టర్లు ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

తాడేపల్లిగూడెం అర్బన్: రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం హామీలు అమలు చేయకపోవడంతో నిరుద్యోగులు, యువత, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. తాడేపల్లిగూడెంలో క్యాంపు కార్యాలయంలో ఈనెల 12న వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో చేపట్టనున్న యువత పోరు పోస్టర్లను సోమవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫీజు రీయింబర్స్‌మెంట్, విద్యాదీవెన పథకాలకు ప్రభుత్వం రూ.4,600 కోట్లు విడుదల చేయాలని, నిరుద్యోగ భృతి అమలు చేయాలని, నూతన మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ నిలిపివేయాలని కోరుతూ కలెక్టర్‌కు వినతిపత్రాలు అందిస్తామన్నారు. దివంగత సీఎం వైఎస్సార్ ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని ప్రవేశపెట్టగా మాజీ సీఎం జగన్ సమర్థవంతంగా అమలు చేశారన్నారు. 2024 డిసెంబరులో విద్యార్థులకు రూ.7,500 కోట్లు సిద్ధం చేయగా ఎన్నికల కోడ్ కారణంగా పంపిణీ చేయకుండా చంద్రబాబు అడ్డుకున్నారని విమర్శించారు. సూపర్ సిక్స్‌లో భాగంగా నిరుద్యోగ భృతి కింద రాష్ట్రంలో 20 లక్షల మంది నిరుద్యోగులకు రూ.7,600 కోట్లు ఇవ్వాల్సి ఉండగా బడ్జెట్‌లో ఆ ఊసే లేదన్నారు. తల్లికి వందనం కింద రూ.12,500 కోట్లు అందించాల్సి ఉండగా బడ్జెట్‌లో రూ.8,500 కోట్లు కేటాయించడం సరికాదన్నారు. జగన్ ప్రభుత్వంలో 17 వైద్య కళాశాలలు ప్రారంభించేందుకు రూ.8 వేల కోట్లు కేటాయించారన్నారు. ఈ మేరకు రాష్ట్రానికి వచ్చిన 2,550 మెడికల్ సీట్ల కోటాను కూటమి ప్రభుత్వం అవసరం లేదని లేఖలు రాయడం స్వార్థ రాజకీయాలకు అద్దం పడుతుందన్నారు.

నియోజకవర్గంలో అసాంఘిక కార్యక్రమాలు

తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో ప్రస్తుత ప్రజాప్రతినిధుల కుటుంబ సభ్యులు, బంధువులు ప్రభుత్వ అనుమతులు, లైసెన్సులు లేకుండా దాబాలు నిర్వహిస్తున్నారని ఆరోపించారు. పలు ప్రాంతాల్లో పేకాట స్థావరాలు యథేచ్ఛగా సాగుతున్నాయన్నారు. పార్టీ నేతలు కర్రి భాస్కరరావు, బండారు నాగు, ముప్పిడి సంపత్‌కుమార్, చెన్నా జనార్దన్, భాస్కరరెడ్డి, జిడ్డు హరిబాబు, కళ్లేపల్లి కృష్ణంరాజు, వీరకుమార్, సూర్పని రామకృష్ణ, వెలిశెట్టి నరేంద్ర కుమార్, అరిగెల అభి పాల్గొన్నారు.

కూటమివి వంచన మాటలు

తణుకు అర్బన్: అబద్ధం, వంచన, మోసపూరిత మాటలతో గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వం విద్యార్థులు, యువత, నిరుద్యోగుల భవిష్యత్తును ముళ్లబాటగా మారుస్తుందని మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు విమర్శించారు. తణుకులోని పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయకుండా పేద విద్యార్థులకు చదువును దూరం చేస్తున్నారన్నారు. దివంగత వైఎస్సార్ స్ఫూర్తితో మాజీ సీఎం జగన్ పేదల చదువులకు పెద్దపీట వేశారన్నారు. అమ్మ ఒడి, విద్యాదీవెన, వసతిదీవెన పథకాలతోపాటు నాడు–నేడుతో పాఠశాలల అభివృద్ధి చేశారని గుర్తుచేశారు. అయితే సీఎం చంద్రబాబు వీటన్నింటినీ తుంగలో తొక్కి పేదలకు విద్యను దూరం చేస్తున్నారని విమర్శించారు. నీకు రూ.15 వేలు.. నీకు రూ.15 వేలు అన్న మంత్రి నిమ్మల రామానాయుడు ఇప్పుడు ఏం సమాధానం చెబుతారని నిలదీశారు. జగన్ ప్రభుత్వంలో తీసుకు వచ్చిన వైద్య కళాశాలలను ప్రైవేట్‌పరం చేసేందుకు కూటమి ప్రభుత్వం కుట్రలు చేస్తోందన్నారు.

యువత పోరుకు తరలిరండి

ఈనెల 12న కలెక్టరేట్ల వద్ద తలపెట్టిన వైఎస్సార్ సీపీ యువత పోరు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కారుమూరి కోరారు. అనంతరం యువత పోరు పోస్టర్లు ఆవిష్కరించారు. పార్టీ లీగల్ సెల్ సభ్యుడు వెలగల సాయిబాబారెడ్డి, పట్టణ అధ్యక్షుడు మారిశెట్టి శేషగిరి, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు పొట్ల సురేష్, పట్టణ మహిళాధ్యక్షురాలు నూకల కనకదుర్గ పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగుల పోరుబాట

సమ్మె ఒప్పందాలు అమలు చేయకపోవడంపై ఆగ్రహం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): విద్యా రంగ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం మొండిచేయి చూపుతోంది. రెగ్యులర్ ఉద్యోగుల కంటే అధిక సమయం విధులు నిర్వహిస్తున్న వారి సేవలను ప్రభుత్వం గుర్తించడం లేదని ఉద్యోగులు ఆవేదన చెందుతున్నారు. సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గత ప్రభుత్వ హయాంలో సమ్మె చేశారు. దీంతో అప్పటి ప్రభుత్వం వారి కోర్కెలను తీర్చడానికి ముందుకు వచ్చింది. సమ్మె కాలంలో ఉద్యోగ సంఘాలతో ఒప్పందం చేసింది.

సమ్మె ఒప్పందాలు విస్మరించిన ప్రభుత్వం

సమగ్ర శిక్ష ఉద్యోగులు నిర్వహించిన సమ్మె సందర్భంగా గత ప్రభుత్వం ఆ ఉద్యోగ సంఘంతో కొన్ని ఒప్పందాలు చేసింది. సమగ్ర శిక్షలోని 7 విభాగాల ఉద్యోగుల వేతనాన్ని 23 శాతానికి పెంచుతూ ఒప్పందం చేయడంతో పాటు అమలు కూడా ప్రారంభించింది. ప్రావిడెంట్ ఫండ్ (పీఎఫ్) అమలు చేయడానికి కార్యనిర్వాహక కమిటీ ఎదుట ప్రతిపాదనలు ఉంచింది. ఉద్యోగుల జాబ్ చార్ట్‌ల కోసం కమిటీ ఏర్పాటుకు ఒప్పందం, కారుణ్య నియామకాలు చేపట్టడానికి ఒప్పందం, ప్రతీ నెల 1వ తేదీనే ఉద్యోగులకు జీతాలు చెల్లించడానికి అంగీకారం వంటి ఒప్పందాలను చేశారు. గత ప్రభుత్వం చేసిన ఒప్పందాల్లో కొన్ని ఆ ప్రభుత్వ హయాంలోనే అమలు చేయగా మరికొన్ని ఒప్పందాలను అమలు చేయడానికి ఏర్పాటు చేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సమగ్రశిక్ష ఉద్యోగులను పూర్తిగా విస్మరించింది.



ఏలూరులోని సమగ్ర శిక్ష కార్యాలయం

ఉమ్మడి పశ్చిమలో 1500 మంది ఉద్యోగులు

ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పరిధిలో సమగ్రశిక్షలో 7 విభాగాల ఉద్యోగులు దశాబ్దాలుగా పని చేస్తున్నారు. మొత్తం మీద సుమారు 1500 మంది ఉద్యోగులు ఆయా విభాగాల్లో కీలకమైన బాధ్యతలు నిర్వహిస్తున్నారు. జిల్లాలో పాఠశాలల అభివృద్ధికి కావాల్సిన నిధులు అంచనా వేసి ప్రతిపాదనలు సిద్ధం చేయడం, విద్యార్థుల యూనిఫారం, షూ కొలతలు సేకరించి అంచనాలు సిద్ధం చేయడం, స్కూల్ బ్యాగ్‌లు పంపిణీ, పార్ట్ టైమ్ శిక్షకులుగా పూర్తిస్థాయిలో విధులు నిర్వహించడం ఇలా జిల్లాలో విద్యా రంగం అభివృద్ధిలో తమ వంతు పాత్ర పోషిస్తున్నారు.

ఇచ్చిన హామీ ఏమైంది?

తమతో చేసుకున్న అన్ని ఒప్పందాలను అమలు చేయాలని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అడిగి అడిగి వేసారి పోయారు. తాము పోరాడి సాధించుకున్న హక్కులను అమలు చేసుకోవడానికి మరోసారి ఉద్యమించాల్సిన పరిస్థితి రావడం వారు జీర్ణించుకోలేకపోతున్నారు. గతంలో తాము చేసిన పోరాటాల సమయంలో తమ శిబిరాలకు వచ్చి మరీ మద్దతుగా నిలిచి, అప్పటి ప్రభుత్వంపై విమర్శలు చేసిన కూటమి నేతలు అధికారంలోకి వచ్చిన తరువాత పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉద్యోగుల డిమాండ్లు సముచితమైనవేనని, తాము అధికారంలోకి వస్తే వారి డిమాండ్లు అన్నీ నెరవేర్చుతామని కూటమి నేతలు హామీలు ఇచ్చారు. ఇదంతా కేవలం అప్పటి ప్రభుత్వంపై బురద చల్లడానికి తమ శిబిరాలను వినియోగించుకోవడానికి మాత్రమేనని, తమపై ప్రేమతో కాదని ఇప్పుడు అర్థం అవుతోందని చెబుతున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని గెలిపించుకుని ఉండి ఉంటే తమకు ఈ తిప్పలు తప్పేవని ఆయా ఉద్యోగులు అభిప్రాయ పడుతున్నారు.

నిరసన దీక్షకు తరలి రావాలి



సమ్మె ఒప్పందాలను అమలు చేయాలనే డిమాండ్‌తో ఈ నెల 11న విజయవాడలోని ధర్నా చౌక్ వద్ద నిర్వహిస్తున్న నిరసన దీక్షకు ఉద్యోగులంతా తరలిరావాలి. ప్రతీ నెలా 1వ తేదీనే జీతాలు విడుదల చేయాలి. మినిమం టైమ్‌స్కేల్ అమలు చేయాలి. పదవీ విరమణ వయసును 62 సంవత్సరాలకు పెంచాలి. సమగ్రశిక్ష ప్రాజెక్టు ఉద్యోగులను విద్యాశాఖలో విలీనం చేయాలి.

వాసా శ్రీనివాసరావు, పార్ట్‌టైమ్ ఇన్‌స్ట్రక్టర్స్ రాష్ట్ర అధ్యక్షుడు

హెచ్‌ఆర్ పాలసీని అమలు చేయాలి



సమగ్ర శిక్ష ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించే హెచ్ ఆర్ పాలసీని ఒప్పందం మేరకు కచ్చితంగా అమలు చేయాలి. ప్రస్తుతం అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను తొలగించేందుకు మార్గం సుగమం చేస్తూ ప్రభుత్వం తీసుకువచ్చిన జీఓ నెంబర్ –2ను తక్షణమే ఉపసంహరించుకోవాలి. ఎన్నికల సందర్భంగా కూటమి పార్టీలు ఇచ్చిన అన్ని హామీలను అమలు చేయాలి.

కే వినోద్ కుమార్, సమగ్ర శిక్ష ఉద్యోగుల జేఏసీ జిల్లా అధ్యక్షుడు

క్లుప్తంగా

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల నమోదు


డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్ చేస్తున్న దృశ్యం

భీమవరం: భీమవరం టూటౌన్ పరిధిలో మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారిపై పోలీసులు కొరడా ఝులిపించారు. టూటౌన్ సీఐ జి.కాళీచరణ్ నేతృత్వంలో ఈ నెల 9న రాత్రి టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అంబేడ్కర్ సెంటర్, పద్మాలయ థియేటర్ ప్రాంతాల్లో మద్యం తాగి బైక్ నడుపుతున్న అయిదుగురిని అరెస్టు చేసి భీమవరం స్పెషల్ జ్యుడిషియల్ సెకండ్‌క్లాస్ మేజిస్ట్రేట్ ముందు హాజరు పర్చగా ఒక్కొక్కరికి రూ.10 వేల జరిమానా విధించారు. టూటౌన్ పరిధిలోని ఏడుగురిని న్యాయమూర్తి ముందు హాజరుపర్చగా వారికి జరిమానా విధించినట్లు సీఐ కాళీచరణ్ చెప్పారు.

ఉండి పోలీసు స్టేషన్ పరిధిలో..

ఉండి: ఉండి పోలీస్‌స్టేషన్ పరిధిలో మద్యం తాగి వాహనం నడిపిన ఇద్దరికి రూ.20 వేల జరిమానా విధించారు. ఇటీవల ఎస్సై ఎండీ నసీరుల్లా ఆధ్వర్యంలో నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ కార్యక్రమంలో పట్టుబడిన ఇద్దరు వాహనదారులపై కేసులు నమోదు చేసి భీమవరం స్పెషల్ కోర్టుకు హాజరుపర్చారు. రూ.10 వేల చొప్పున జరిమానా విధించారు.

మిషన్‌లో పడి వ్యక్తి మృతి

పెదవేగి: పశువుల దాణాకు మొక్కజొన్న ఆకులను కట్ చేసే మిషన్‌లో పడి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన పెదవేగి మండలం రామచంద్రపురం గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. సోమవారం రాత్రి పెదవేగి మండలం నడిపల్లి – రామచంద్రపురం సరిహద్దులో ఉన్న మొక్కజొన్న ఫ్యాక్టరీలో చొప్ప ముక్కలు చేసే మిషన్‌లో పడి సింగపాము రవీంద్ర(34) మృతిచెందాడు. మృతుడికి భార్య సుజాత, ఇద్దరు ఆడ పిల్లలు ఉన్నారు. మృతుడి శరీర భాగాలు ముక్కలుగా తెగడంతో సంఘటన స్థలంలో పరిస్థితి భీతావహంగా ఉంది. పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు.

వీహెచ్‌పీ ఆధ్వర్యంలో నిరసన

ఏలూరు (టూటౌన్): రాయచోటిలో ఈ నెల 4వ తేదీన వీరభద్ర స్వామి ఉత్సవాల సందర్భంగా ర్యాలీ నిర్వహిస్తున్న హిందువులపై దాడి చేసిన వారికి పోలీసులు వత్తాసు పలుకుతూ అక్రమ కేసులు పెట్టారని నిరసిస్తూ విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ) ఆధ్వర్యంలో ఏలూరు కలెక్టరేట్ వద్ద సోమవారం పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. హిందూ సంఘాల ప్రతినిధులు, వీహెచ్‌పీ సభ్యులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ధర్నా చౌక్ వద్ద నిరసన తెలిపారు. హిందువులపై దాడి చేసిన వారిని వెంటనే పోలీసులు అరెస్టు చేయాలని, అక్రమ కేసులు ఎత్తివేయాలని నినాదాలు చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. వీహెచ్‌పీ ఆంధ్రా, తెలంగాణ ప్రాంత కార్యదర్శి తనికెళ్ళ సత్య రవికుమార్ మాట్లాడుతూ పోలీసులు ఒక వర్గం వారికి అనుకూలంగా పక్షపాత ధోరణితో వ్యవహరించడం తగదన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గారపాటి సీతారామాంజనేయ చౌదరి, మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు నిర్మల కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి


నడపన శ్రీనివాస్ (44)

పాలకొల్లు సెంట్రల్: రొయ్యల చెరువుల వద్ద విద్యుత్ షాక్‌కు గురై వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. రూరల్ ఎస్సై బి.సురేంద్రకుమార్ తెలిపిన వివరాలు ప్రకారం మండలంలోని తిల్లపూడి గ్రామానికి చెందిన నడపన శ్రీనివాస్ (44) సోమవారం ఉదయం చెరువుల వద్దకు పనికి వెళ్లాడు. మోటర్‌కు ఉన్న విద్యుత్ వైర్లను గమనించకపోవడంతో ఆ వైర్లు తగిలి శ్రీనివాస్ అక్కడికక్కడే మృతి చెందాడు. అతనికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుటుంబ పోషణకు అతనే ఆధారం. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సురేంద్ర తెలిపారు.

పోలవరం నిర్వాసితుల ధర్నా

పోలవరం రూరల్: 18 ఏళ్లు నిండిన యువతకు, మహిళ వివాహితులకు కూడా ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ వర్తింపచేయాలని ఆదివాసి మహాసభ అధ్యక్షుడు మిడియం వెంకటస్వామి, అడ్వకేట్ బాబ్జీ డిమాండ్ చేశారు. సోమవారం పోలవరం తహసీల్దార్ కార్యాలయం వద్ద మండలంలోని కొండ్రుకోట, కోరుటూరు, తూటిగుంట పంచాయతీలకు చెందిన మహిళలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మిడియం వెంకటస్వామి, అడ్వకేట్ బాబ్జీ మాట్లాడుతూ మండలంలో మొత్తం 29 గ్రామాలు పోలవరం ప్రాజెక్టులో ముంపునకు గురవుతున్నాయన్నారు. ఎగువ ఏజెన్సీలో 19 గిరిజన గ్రామాల నిర్వాసితులు ప్యాకేజీలు ఇవ్వకపోయినప్పటికీ గోదావరి వరదలకు భయపడి 2022లో గ్రామాన్ని ఖాళీ చేసి పునరావాస గ్రామాలకు తరలి వెళ్లారన్నారు. కటాఫ్ డేట్ పేరుతో నిర్వాసితుల పేర్లు తొలగించి, అసలు నిర్వాసితులు కాని వారికి, నిర్వాసిత గ్రామాలతో సంబంధం లేని వారి పేర్లు నమోదు చేసి ఇష్టారాజ్యంగా ప్యాకేజీలను ధారాదత్తం చేశారని ఆరోపించారు. ఇప్పటికైనా అవినీతిపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. వివాహం అయిన పురుషులకు ప్యాకేజీ ఇచ్చినట్లు స్త్రీలకు ఇవ్వాలన్నారు. అనంతరం పోలవరం తహసిల్దార్ సాయి రాజుకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో తెలిపేటి మహేశ్వరి, పుట్టి సృజన, కొనుతుల మహేశ్వరి, అరగంటి అఖిల, తొర్లపాటి లక్ష్మి, మాడే అలేఖ్య, తెలిపేటి సందీప్ రెడ్డి, ఆకుల మౌనిక, నిర్వాసిత మహిళలు పాల్గొన్నారు.


పోలవరం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న నిర్వాసితులు

కోకోకు మద్దతు ధర ఇవ్వాలి

ఏలూరు (టూటౌన్): కోకో గింజల కొనుగోలు సమస్యను పరిష్కరించాలని, కిలో కోకో గింజలకు రూ.900 ధర కల్పించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ కోకో రైతుల సంఘం ఆధ్వర్యంలో గుంటూరులోని రాష్ట్ర ఉద్యాన శాఖ కార్యాలయం ముందు కోకో రైతులు సోమవారం ధర్నా నిర్వహించారు. ఉద్యాన శాఖ రాష్ట్ర అడిషనల్ డైరెక్టర్ సీవీ హరినాథ్ రెడ్డికి రైతులు వినతిపత్రం అందజేశారు. రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కె. శ్రీనివాస్, ఆంధ్రప్రదేశ్ కోకో రైతుల సంఘం నాయకులు బొల్లు రామకృష్ణ, జె.కాశీ బాబు, కోనేరు సతీష్ బాబు, బోళ్ళ వెంకట సుబ్బారావు మాట్లాడుతూ.. కోకో గింజల కొనుగోలు సమస్యను వెంటనే పరిష్కరించకపోతే కోకో రైతులు తీవ్రంగా నష్టపోతారని ఆందోళన వ్యక్తం చేశారు. కంపెనీలు విదేశాల నుంచి కోకో గింజలు దిగుమతి చేసుకున్నామని రైతులను బెదిరిస్తూ సిండికేట్‌గా మారి కోకో గింజల ధరను తగ్గించి వేస్తూ రైతులను ఇబ్బందులకు గురి చేయడం తగదన్నారు. అంతర్జాతీయ మార్కెట్ ప్రకారం కోకో గింజలకు ధర కల్పించి రైతులను ఆదుకోవాలని కోరారు. కోకో గింజల కొనుగోలు కంపెనీలతో రైతుల సమక్షంలో చర్చలు జరిపి కిలో కోకో గింజలకు రూ. 900 ధర కల్పించాలని డిమాండ్ చేశారు. సమస్యపై ఉద్యాన శాఖ రాష్ట్ర అడిషనల్ డైరెక్టర్ హరినాథ్ రెడ్డి మాట్లాడుతూ కోకో గింజల కొనుగోలు సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కోకో ప్రాసెసింగ్ యూనిట్స్ నెలకొల్పేందుకు రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీ పథకాలు అమలు చేస్తుందని వివరించారు.


గుంటూరులో ఉద్యాన శాఖ అడిషనల్ డైరెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న కోకో రైతులు

అర్జీలు నాణ్యతతో పరిష్కరించాలి


అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ నాగరాణి

భీమవరం (ప్రకాశంచౌక్): ప్రజలు అందజేసిన అర్జీలను నాణ్యతతో పరిష్కరించాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, ఇతర అధికారులతో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. అర్జీలను పెండింగ్ లేకుండా త్వరితగతిన పరిష్కరించాలని తహసీల్దార్లను ఆదేశించారు. ప్రతి అర్జీని పరిశీలించి ఎండార్స్‌మెంట్ ఇవ్వాలన్నారు. సంబంధిత ఆర్డీఓలు వారి పరిధిలోని మండలాలలో పర్యటించి ఎండార్స్‌మెంట్లను పరిశీలించాలని ఆదేశించారు. ఫిర్యాదుదారుల నుంచి 367 అర్జీలు స్వీకరించామని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో డీఆర్ఓ మొగిలి వెంకటేశ్వర్లు, వార్డు సచివాలయం అధికారి వై.దోసి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సైబర్ మోసంపై కేసు నమోదు

ఉంగుటూరు: నారాయణపురంలోని ఒక షాపులో యువకుడు ఫోన్ పే పేరుతో రూ. 98 వేలు తన ఖాతాలోకి మళ్లించుకున్న ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. 2,800 బిల్లు చేసిన ఆ యువకుడు ఫోన్ పే చేస్తానని చెప్పి షాపు యజమాని ఫోను రూ.1 ఫోన్ పే చేయమన్నాడు. యజమాని రూపాయి ఫోన్ పే చేశాడు. ఆ యువకుడు ఇప్పుడే వస్తానని బయటకు వెళ్ళాడు. వెంటనే షాపు ఓనరు బ్యాంకు ఖాతా నుంచి రూ.98 వేలు డెబిట్ అయినట్లు ఫోన్‌కు మెసేజ్ వచ్చింది. మోసపోయినట్లు గుర్తించి వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

చిన వెంకన్న సేవలో హైకోర్టు న్యాయమూర్తి


హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గోపాల కృష్ణారావుకు మెమెంటో అందజేస్తున్న దృశ్యం

ద్వారకాతిరుమల: ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయాన్ని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.గోపాల కృష్ణారావు సోమవారం సందర్శించారు. సతీసమేతంగా ఆలయానికి విచ్చేసిన ఆయనకు ముందుగా దేవస్థానం అధికారులు, అర్చకులు తూర్పురాజగోపురం వద్ద పూర్ణకుంభ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ముఖ మండపంలో న్యాయమూర్తికి అర్చకులు, పండితులు శ్రీవారి శేష వస్త్రాన్ని కప్పి, వేద ఆశీర్వచనాన్ని పలుకగా, ఆలయ డీఈఓ బాబురావు స్వామివారి మెమెంటో, ప్రసాదాలు అందజేశారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

భీమవరం: భీమవరం ఒకటో పట్టణం విస్సాకోడేరు వంతెన సమీపంలో లారీ ఢీకొనడంతో ద్విచక్రవాహనంపై వెళ్తున్న మహిళ మృతి చెందిందని పోలీసులు తెలిపారు. మృతురాలిని పాలకొల్లు వాసిగా గుర్తించామన్నారు.

బంగారం, వెండి చోరీ

ఆగిరిపల్లి: ఇంటి తాళం పగులగొట్టి దొంగలు బంగారం, వెండి, నగదు చోరీ చేశారు. ఆగిరిపల్లి గౌడ బజార్‌కు చెందిన పల్లగాని రాంబాబు కుటుంబ సభ్యులు సోమవారం ఉదయం బంధువుల ఇంటికి వెళ్లారు. మధ్యాహ్నం ఇంటికి తిరిగి రాగా తాళాలు పగలగొట్టి బీరువాలో ఉన్న 40 తులాల వెండి, నాలుగు బంగారం ఉంగరాలు, రూ.3,500 నగదు చోరీ చేశారు.

పెద్దింట్లమ్మ జాతరకు పోటెత్తిన భక్తులు


కైకలూరు: కొల్లేటికోట పెద్దింట్లమ్మ జాతరలో ప్రధాన ఘట్టమైన జలదుర్గా, గోకర్ణేశ్వరస్వామి కల్యాణోత్సవానికి సోమవారం వేలాదిగా భక్తులు తరలివచ్చారు. ఈ నెల 1 నుంచి 13 వరకు జాతర నిర్వహిస్తున్నారు. సోమవారం రాత్రి జరిగిన కల్యాణానికి దేవస్థానం తరపున ఈవో కూచిపూడి శ్రీనివాసు పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు అందించారు. ఆలయ ప్రధాన అర్చకుడు పేటేటి పరమేశ్వర శర్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి, పంచహారతులు అందించారు. పెద్దింట్లమ్మకు వస్త్ర, పుష్పాలంకరణ, ఉచిత ప్రసాద దాతలుగా భుజబలపట్నం గ్రామానికి చెందిన గొట్టుముక్కల ప్రసాదరాజు, ముదునూరి జానకీ సుబ్బరాజు, తాడిపూడికి చెందిన కూసంపూడి రామకృష్ణంరాజు, కైకలూరుకు చెందిన కలిదిండి సూర్యనారాయణవర్మ వ్యవహరించారు. అమ్మవారికి భక్తులు వేడి నైవేద్యాలు, పాల పొంగళ్లు సమర్పించారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. శక్తి వేషాలు, గరగ డప్పుల నృత్యాలు, కేరళ చండా మేళం, తీన్మార్ డప్పులు ఆకట్టుకున్నాయి. జాతరలో ఎలాంటి ఘటనలు జరగకుండా భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. సీఐ వి.రవికుమార్, రూరల్ ఎస్ఐ వి.రాంబాబుల ఆధ్వర్యంలో 120 మంది పోలీసు సిబ్బంది విధులు నిర్వహించారు.

పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాల సమర్పణ


పెద్దింట్లమ్మ తల్లి


పెద్దింట్లమ్మ జాతరలో శక్తి వేషాలు


గరగ డప్పుల నృత్యాలు


ఆకట్టుకున్న ప్రభ ఊరేగింపు

ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఫీజు రీయింబర్స్‌మెంట్, విద్యా దీవెన, వసతి దీవెన నిధులు తక్షణమే విడుదల చేయాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చీకటిమిల్లి మంగరాజు డిమాండ్ చేశారు. స్థానిక హౌసింగ్‌బోర్డు కాలనీలో సోమవారం జరిగిన సమావేశంలో మంగరాజు మట్లాడుతూ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రూ.3 వేలు నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పారని ఇంతవరకూ ఇవ్వలేదన్నారు. 20 లక్షల మంది నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వడానికి తగు చర్యలు చేపట్టాలన్నారు. మోగా డీఎస్సీ తక్షణమే ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 12న నిరుద్యోగుల కోసం, ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం వైఎస్ఆర్‌సీపీ తలపెట్టిన రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న ధర్నాకు మాల మహానాడు పూర్తి మద్దతు ప్రకటిస్తుందని చెప్పారు.


మాట్లాడుతున్న చీకటిమిల్లి మంగరాజు

పీడీఎస్ బియ్యం స్వాధీనం

పెనుగొండ: రీజనల్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వి.శ్రీరాం బాబు ఆదేశాల మేరకు సోమవారం పీడీఎస్ బియ్యం నిల్వలపై దాడి చేసినట్లు విజిలెన్స్ సీఐడీ ప్రసాద్ కుమార్ తెలిపారు. సిద్ధాంతం శ్రీ మారుతీ కిరాణా అండ్ జనరల్ స్టోర్ షాపులో తనిఖీలు చేయగా 15 క్వింటాళ్ల బియ్యం అక్రమ నిల్వ చేసినట్లు గుర్తించామన్నారు. షాపు యజమాని సత్య శ్రీనివాసును ప్రశ్నించగా సిద్ధాంతం పరిసర ప్రాంతాలలో కార్డుదారులను నుంచి బియ్యం సేకరించి ఆలమూరు మండలం నర్సిపూడి గ్రామానికి తరలించి కిలో రూ.24కు అమ్ముతున్నట్లు చెప్పారన్నారు. సీజ్ చేసిన బియ్యం ధర రూ. 60,000 ఉంటుందని చెప్పారు. కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

ప్రజా ఫిర్యాదులు తక్షణం పరిష్కరించాలి


భీమవరంలో బాధితులతో మాట్లాడుతున్న ఎస్పీ అద్నాన్ నయీం అస్మి

భీమవరం: భీమవరం జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఎస్పీ అద్నాన్ నయీం అస్మి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన 16 మంది నుంచి వినతులు స్వీకరించారు. బాధితుల సమస్యలను నిశితంగా తెలుసుకుని వాటిపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి చట్టపరిధిలో పరిష్కారం అందిస్తామని బాధితులకు భరోసా ఇచ్చారు. కుటుంబ తగాదాలు, సైబర్ మోసాలు, తల్లిదండ్రులు, అత్తారింటి వేధింపులు, ఆస్తి వివాదాలు, నకిలీ పత్రాలు, అధిక వడ్డీలు, ఆన్‌లైన్ మోసం వంటి సమస్యలపై ఫిర్యాదు చేయగా సంబంధిత పోలీసు స్టేషన్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి ఫిర్యాదు అంశాలను పరిశీలించి తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

క్లుప్తంగా

వైభవంగా మహాదేవుని కల్యాణం


స్వామి వారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని కొండ్రుప్రోలు గ్రామంలో వేంచేసియున్న భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి వారి ఆలయంలో ఆదివారం రాత్రి కల్యాణం వైభవంగా నిర్వహించారు. క్రోధినామ సంవత్సరం ఉత్తరాయణం ఫాల్గుణ శుద్ధ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని ఈ కల్యాణం నిర్వహించినట్లు ఆలయ అర్చకులు రామేశ్వరపు రామలింగేశ్వర శర్మ తెలిపారు.

లక్ష్మీనారాయణ స్వామికి అభిషేకాలు


లక్ష్మీనారాయణ స్వామి

తాడేపల్లిగూడెం (టీఓసీ): వాసవీ పంచాయతన క్షేత్రంలో వేంచేసియున్న లక్ష్మీనారాయణ స్వామికి సోమవారం పంచామృతాలతో, పలు పళ్ల రసాలతో, సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమంలో నున్న సుందరం, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి ఆలయానికి విరాళం


విరాళం అందజేస్తున్న దాత

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని కుంచనపల్లిలో శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయానికి పట్టణానికి చెందిన పంజా దేవో ప్రసాద్, నాగ సరోజినీదేవి దంపతులు రూ.25 వేలను విరాళంగా అందించారు. ఈ మేరకు సోమవారం ఆలయ ట్రస్ట్ చైర్మన్ దాసరి మల్లిఖార్జునరావుకు అందజేశారు. వారికి ఆలయ ట్రస్ట్, కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

14న అయ్యప్పకు పంచామృతాభిషేకాలు

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని పడాలలో వేంచేసియున్న అయ్యప్పస్వామి ఆలయ సముదాయంలో ఈ నెల 14న స్వామి వారికి గణపతి హోమం, పంచామృతాభిషేకాలు నిర్వహించనున్నట్టు అయ్యప్ప సేవా సమితి సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 6 గంటలకు మీన సంక్రమణ సందర్భంగా 18 మెట్లకు విశేష పూజలు, అనంతరం పలు రకాల పుష్పాలతో అర్చనలు నిర్వహిస్తారన్నారు. భక్తులు ఈ కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరారు.

మాజీ కౌన్సిలర్లకు అవార్డులు


అవార్డులు అందుకున్న మాజీ కౌన్సిలర్లు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణానికి చెందిన మాజీ కౌన్సిలర్లు అడపా జమున, గుండుమోగుల పద్మప్రియ,పెంటా రాజేశ్వరీలకు నారీరత్న ఉమెన్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ అవార్డులు అందుకున్నారు. శ్రీశ్రీ కళావేదిక సీఈఓ డాక్టర్ కత్తిమండ ప్రతాప్ ఆధ్వర్యంలో కొల్లి రమావతి అధ్యక్షతన అంతర్జాతీయ మహిళా దినోత్సవం విజయవాడలో నిర్వహించారు. ఈ సందర్భంగా వీరికి అవార్డులు ఇచ్చారని తెలిపారు. అవార్డు గ్రహీతలను సత్కరించి, పట్టణ ప్రముఖులు అభినందనలు తెలిపారు.

ఐరన్ షెడ్డుకు శంకుస్థాపన


శంకుస్థాపన చేసిన బార్ అసోసియేషన్ ప్రతినిధులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): హైకోర్టు అనుమతితో పట్టణంలోని కోర్టు భవనాల సముదాయంలో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఐరన్ షెడ్డు ఏర్పాటు నిమిత్తం సోమవారం మధ్యాహ్నం భూమి పూజ, శంకు స్థాపనలు చేశారు. అడిషనల్ జడ్జి షేక్ సికిందర్ భాషా, సీనియర్ సివిల్ జడ్జి కె.మాధవి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్.సూర్య కిరణ్ హాజరయ్యారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దూలం విజయకుమార్, న్యాయవాదులు కంకట శ్రీనివాస్, ఫరోత్‌బాబు, రత్నదీప్, నయనాల నారాయణ స్వామి, సత్యవాణి, ఎం.శ్రీనుబాబు, కార్యవర్గం, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

రహదారికి మోక్షమెప్పుడో?


అధ్వానంగా ఉన్న రహదారి


రహదారిపై ఏర్పడిన గుంతలు

తాడేపల్లిగూడెం రూరల్: పెంటపాడు మండలం ప్రత్తిపాడు వై.జంక్షన్ నుంచి ఉంగుటూరు మండలం బాదంపూడి వరకు రహదారి నిర్మాణం ఎప్పుడు చేపడతారోనని ప్రయాణికులు ఆశగా ఎదురు చూస్తున్నారు. ఈ రహదారి అడుగుకో గొయ్యి అన్న చందంగా తయారైంది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత తాడేపల్లిగూడెం టౌన్ నుంచి ప్రత్తిపాడు వరకు పలు చోట్ల ప్యాచ్ వర్కులు చేపట్టారు. అయితే, ప్యాచ్ వర్కులను అనుకొని మరికొన్ని చోట్ల రహదారిపై గోతులు ఏర్పడ్డాయి. అయితే కొండ నాలుకకు మందు వేస్తే ఉన్న నాలుక ఊడిందనే చందంగా రహదారి మరమ్మతులు ఉన్నాయని పలువురు బాహాటంగానే విమర్శిస్తున్నారు. దీంతో రహదారిపై గోతుల పరిస్థితి యథా మామూలుగానే మారింది. పగటి పూట ప్రయాణం ఎలా ఉన్నా రాత్రి సమయంలో ఈ గుంతలు కనిపించడం లేదని వాహనదారులు వాపోతున్నారు. ఏ మాత్రం వాహనాన్ని ఒక వైపు నుంచి మరో వైపునకు తిప్పితే వెనుకనుంచి ఏ వాహనంవచ్చి ఢీ కొడుతుందోనని వాహనదారులు భయ పడుతున్నారు. ఈ క్రమంలో గుంతల్లో పడి వాహనం మరమ్మతులకు వస్తుందని పేర్కొంటున్నారు. ఇదిలా ఉంటే పలు ప్రభుత్వ, ప్రైవేట్ బస్సులు, వాహనాలు సైతం దారి మళ్లించుకొని జాతీయ రహదారిపై రాకపోకలు సాగిస్తున్నాయి. పలువురు వాహనదారులు జాతీయ రహదారి మీదుగా తాడేపల్లిగూడెం పట్టణంలోకి రాకపోకలు సాగించడం గమనార్హం. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు, సంబంధిత శాఖ అధికారులు స్పందించి ఈ రహదారిని త్వరితగతిన నిర్మించాలని వాహనదారులు కోరుతున్నారు.

బీసీల అభ్యున్నతికి వైఎస్సార్‌సీపీ కృషి


కట్టుబోయినను అభినందిస్తున్న కొట్టు సత్యనారాయణ

మాజీ ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

పెంటపాడు: బీసీల అభ్యున్నతికి వైఎస్సార్‌సీపీ కృషి చేస్తుందని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వారికి నిత్యం అండగా ఉంటారని, మాజీ ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ పేర్కొన్నారు. జట్లపాలెం గ్రామానికి చెందిన పార్టీ నాయకులు, వ్యవసాయ సలహా మండలి మాజీ అధ్యక్షుడు కట్టుబోయిన కృష్ణప్రసాద్‌ను వైఎస్సార్‌సీపీ రాష్ట్ర బీసీసెల్ అధ్యక్షుడిగా పార్టీ నియమించిన దృష్ట్యా గూడెం వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సోమవారం కొట్టు సత్యనారాయణ ప్రత్యేకంగా అభినందించి, సత్కరించారు. ఈ సందర్భంగా కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ బీసీలకు ఉన్నత స్థానం కల్పించిన ఆదర్శ నేత జగనన్నే అన్నారు. నిత్యం జగనన్నకు అండగా ఉందామన్నారు. కాగా వైఎస్సార్ సీపీ రాష్ట్ర బీసీసెల్ ప్రధాన కార్యదర్శిగా నియమితులైన జట్లపాలెంకు చెందిన కట్టుబోయిన కృష్ణప్రసాద్ మాట్లాడుతూ తనకు ఈ పదవి వచ్చేందుకు కృషి చేసిన మాజీ ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కర్రి భాస్కర రావు, బీసీ చెన్నా జనార్ధన్, తదితరులు పాల్గొన్నారు.

సావిత్రిబాయి పూలేకు ఘన నివాళి


సావిత్రి బాయి పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి కారుమూరి

తణుకు అర్బన్: సావిత్రిబాయి పూలే జీవన విధానం ఆదర్శప్రాయమని మాజీమంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. సావిత్రిబాయి పూలే వర్ధంతి సందర్భంగా సోమవారం తణుకు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్త్రీ విద్యతోనే సమాజం అభివృద్ధి చెందుతుందని చాటి చెప్పి నిరూపించిన మహనీయురాలు సావిత్రి బాయి పూలే అన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు వెలగల సాయిబాబారెడ్డి, పొట్ల సురేష్, మారిశెట్టి శేషగిరి, ఉండవల్లి జానకి, నూకల కనకదుర్గ, ఫణీంద్ర కుమార్ వీరమల్లు, చింతన్న, షేక్ జిలానీ, వై.రామకృష్ణ, బొల్లాడ శ్రీనివాసు, పుల్లెపు సూర్యచంద్రరావు, పార్థసారథి, గారపాటి సత్యనారాయణ, రేలంగి రాంబాబు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల అరెస్టు దారుణం



నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

తణుకు అర్బన్: చలో విజయవాడకు వెళుతున్న అంగన్‌వాడీ కార్యకర్తలను అక్రమ అరెస్టులు చేయడం, ఇంటి వద్ద నిర్బంధించడం దుర్మార్గమని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పీవీ ప్రతాప్ అన్నారు. తణుకు నరేంద్ర సెంటర్‌లో సోమవారం నిర్వహించిన అంగన్‌వాడీల నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలు నెరవేర్చమని కోరుతూ చేస్తున్న నిరసనల్లో భాగంగా విజయవాడకు వెళుతున్న వారిని ప్రభుత్వం పోలీసులతో అడ్డుకోవడం చేతకానితనమని విమర్శించారు. ఈ సందర్భంగా కనీస వేతనం రూ 26 వేలు ఇవ్వాలని, మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలని, పెండింగ్ వేతనాలు ఇవ్వాలని, తదితర సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీలు నినాదాలు చేశారు. ఎస్.ఆదినారాయణబాబు, గార రంగారావు, కనకదుర్గ, ధనలక్ష్మి, రమాదేవి, మధు శీల, సుబ్బలక్ష్మి, కనక మహాలక్ష్మి, బిందు, సత్య, విజయ, నాగదుర్గ, రాధా పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి ‘మానవత’ కృషి


మానవత విద్యా కమిటీ చైర్మన్ నాగేశ్వరరావుకు మొక్కలు అందిస్తున్న సభ్యులు

తణుకు అర్బన్: మానవత సేవా సంస్థ విద్యకు అత్యధిక ప్రాధాన్యతనిచ్చే క్రమంలో రూ.2 కోట్ల విద్యానిధిని జిల్లా మానవత సేవా సంస్థ ఏర్పాటు చేసి విద్యాభివృద్ధికి కృషి చేస్తుందని విద్యా కమిటీ చైర్మన్ ఆలపాటి నాగేశ్వరరావు అన్నారు. సోమవారం తణుకు ఏకేటీపీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మానవత సంస్థ అందిస్తున్న 40వ రోజు అల్పాహారం ముగింపు కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులకు కెరీర్‌గైడెన్స్, స్కాలర్‌షిప్స్, మెరిట్ అవార్డులు ఇవ్వడం ద్వారా యువతను ఉన్నత విద్యావకాశాల వైపు మానవత ప్రోత్సహిస్తుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మానవత కమిటీ జిల్లా అధ్యక్షులు దేవినేని భాస్కర రావు, మానవత ప్రతినిధులు కోడూరి రాధాపుష్పవతి, కఠారి శారద, గమిని రాంబాబు, సంకు మనోరమ, బోయపాటి రామలక్ష్మి పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): నియోజకవర్గంలోని తాడేపల్లిగూడెం టౌన్, పెంటపాడులలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు సోమవారం ప్రశాంతంగా జరిగాయి. టౌన్‌లోని ఐదు సెంటర్లు శ్రీవాసవి, ఆదిత్య, జీఎంఆర్, ప్రభుత్వ జూనియర్ కళాశాల, డీఆర్ గోయెంకా ఉమెన్స్ జూనియర్ కళాశాలలోనూ, అదే విధంగా పెంటపాడులో ఒక సెంటర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రథమ సంవత్సరం లెక్కలు పేపర్–2బీ, జూవాలజీ–2, హిస్టరీ–2 పరీక్షలు నిర్వహించారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు నిర్వహించారు. 1879 మంది పరీక్ష రాయాల్సి ఉండగా, 1849 మంది పరీక్షలకు హాజరయ్యారు. 30 మంది పరీక్షలకు గైర్హాజరయ్యారు. చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లు పర్యవేక్షించారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు


కోదండ రామాలయం వద్ద పూజాధికాలు నిర్వహిస్తున్న ధర్మకర్త దంపతులు

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని ఆరుళ్ల గ్రామంలో పునర్నిర్మించిన కోదండ రామాలయంలో సోమవారం నుంచి విగ్రహ పునఃప్రతిష్ఠా మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్త మాకరాజు సతీష్, సుధశ్రీ దంపతులు పూజా క్రతువులు నిర్వహించారు. వేద పండితులు బ్రహ్మశ్రీ ఫణిశర్మ, భైరవభట్ల మురళీకృష్ణ శర్మ బ్రహ్మత్వంలో గణపతి పూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, ప్రధాన కలశారాధన పూజలను నిర్వహించారు. సర్పంచ్ మాకరాజు వరలక్ష్మి, ఊడిమూడి నాగరాజు, ఉప్పలపు వెంకట్రాజు, మహాశివభట్టు శ్రీనివాసరాజు, మహాశివభట్టు సత్యనారాయణరాజు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి


ర్యాలీ నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది

తాడేపల్లిగూడెం (టీఓసీ): కీటక జనిత ప్రదేశాలను నిలువరించి, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుదామని సబ్ యూనిట్ అధికారి వైవీ లక్ష్మణరావు పేర్కొన్నారు. పట్టణ ఆరోగ్య కేంద్రం కడకట్ల పరిధిలో సోమవారం 32, 34, 35 వార్డుల్లో వెంక్టార్ కంట్రోల్ హైజీన్ కార్యాక్రమాలు నిర్వహించారు. అవగాహన ర్యాలీలు నిర్వహించారు. లక్ష్మణరావు మాట్లాడుతూ దోమలను నివారించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా, ఫైలేరియా, మెదడు వాపు వ్యాధి రాకుండా ఉండేందుకు తప్పనిసరిగా దోమలను నివారించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలని కోరారు. కార్యక్రమంలో జ్యోతి, రాజేశ్వరి, పుష్ప, స్వాతి, కాంతారావు, తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా మదనగోపాలుని కల్యాణం


బల్లిపాడులో నిర్వహిస్తున్న మదనగోపాలుని రథోత్సవం


మదనగోపాలస్వామికి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు


ఆలయ ఆవరణలో మురళీకోలాట భజన చేస్తున్న చిన్నారులు

అత్తిలి: బల్లిపాడు గ్రామంలో వేంచేసియున్న శ్రీరుక్మిణీ సత్యభామా సమేత శ్రీమదన గోపాల స్వామి వారి కల్యాణోత్సవం సోమవారం వేకువజామున నేత్ర పర్వంగా నిర్వహించారు. స్వామి వారిని గరుడవాహనంపై, శ్రీరుక్మిణీ సత్యభామా అమ్మవార్లను గజవాహనంపై ఉంచి ఎదురు సన్నాహ గ్రామోత్సవం నిర్వహించారు. పుష్పాలతో అలంకరించిన కల్యాణ మండపంపై స్వామి వారి కల్యాణోత్సవాన్ని పెద్దింటి అనిల్‌కుమార్ ఆచార్యులు ఆధ్వర్యంలో వేద పండితుల మంత్రోచ్ఛరణలు, బాణసంచా కాల్పుల నడుమ అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. కల్యాణోత్సవాన్ని తిలకించేందుకు పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. అనంతరం శ్రీస్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ, కృష్ణతులసి దంపతులు హాజరై స్వామి వారిని దర్శించుకున్నారు. మహిళా భక్త బృందంచే విష్ణు సహస్రనామ పారాయణం, భజన కాలక్షేపం, మదనగోపాల్ స్కూల్ విద్యార్థులచే మురళీకోలాట భజన, అన్నసమారాధన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కార్య నిర్వహణాధికారి ఎల్ఎల్ శ్రీనివాస్, ఉత్సవ కమిటీ సభ్యులు గారపాటి వెంకట సుబ్బారావు, గారపాటి శివకృష్ణ అశోక్, బుద్ధాల భాస్కరరావు, ఆకుల వెంకటేశ్వర రావు, తోట నాగ వెంకట శివగణేష్, ప్రగడ నాగ వెంకట మణికంఠ గోపాలకృష్ణ, గునుపూడి నరేష్, పెచ్చెట్టి సత్యనారాయణ, కొల్లి సంతోషం, కోటిచుక్కల పోతురాజు పాల్గొన్నారు.

వైభవోపేతంగా మదనగోపాలుని రథోత్సవం

వైష్ణవ దేవాలయాలలో ప్రసిద్ధిగాంచిన అత్తిలి మండలం బల్లిపాడు మదనగోపాలస్వామి వారి రథోత్సవం సోమవారం సాయంత్రం అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. పుష్పాలతో అలంకరించిన రథంపై స్వామి, అమ్మవార్లను ఉంచి, మేళతాళాలు, బాణసంచా కాల్పుల నడుమ స్వామి వారి రథోత్సవ కార్యక్రమం నిర్వహించారు. యువత, పెద్దలు, గ్రామస్తులు రథం లాగే కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. చిన్నారులను రథంపై ఉన్న అర్చక స్వాములకు ఇచ్చి స్వామివారి ఆశీస్సులు పొందారు. రథోత్సవ కార్యక్రమంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అత్తిలి ఎస్సై పి.ప్రేమరాజు ఆధ్వర్యంలో పటిష్టమైన పోలీస్ బందోబస్తు నిర్వహించారు. ఆలయ కార్య నిర్వహణాధికారి ఎల్ఎ ల్ శ్రీనివాస్ రథోత్సవాన్ని పర్యవేక్షించారు.

ఎన్నికల హామీలు అమలు చేయాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): కూటమి పార్టీలు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని సీపీఎం జిల్లా కమిటీ తీవ్రంగా ఖండించింది. ఈమేరకు సోమవారం సీపీఎం జిల్లా సెక్రటేరియట్ సభ్యులు చింతకాయల సత్యనారాయణ, సీపీఎం నాయకులు సిరపరపు రంగారావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి తొమ్మిది నెలలు అవుతుందని, నేటికీ హామీలను అమలు చేయలేదని విమర్శించారు. రానున్న రోజుల్లో సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమాలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

తణుకు అర్బన్: వేల్పూరు సబ్ స్టేషన్ లైన్ల మరమ్మతుల నిమిత్తం మంగళవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నామని విద్యుత్ శాఖ డివిజినల్ ఇంజనీరు కె.నరసింహమూర్తి తెలిపారు. తణుకు రూరల్ మండలంలోని వేల్పూరు సబ్ స్టేషన్ పరిధిలో వేల్పూరు, వీరభద్రపురం, రేలంగి, కావలిపురం, యర్రాయిచెరువు, కొమరవరం, మహాలక్ష్మి చెరువు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు


గేదెలకు గాలికుంటు వ్యాధి టీకాలు వేస్తున్న పశు వైద్యులు


తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని చినతాడేపల్లి, నందమూరు, ఆరుళ్ల గ్రామాల్లో సోమవారం గాలికుంటు వ్యాధి నివారణ టీకాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరిగి పాడి పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు, లేగదూడలకు బ్రూసెల్లోసిస్ వ్యాధి నివారణ టీకాలను వేశారు. చినతాడేపల్లిలో 112 ఆవులు, 389 గేదెలకు గాలికుంటు వ్యాధి టీకాలు వేశారు. కాగా, నందమూరు, ఆరుళ్ల గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమాన్ని పశుసంవర్ధక శాఖ జిల్లా అధికారి డాక్టర్ మురళీకృష్ణ పరిశీలించారు. పశు వైద్యాధికారి డాక్టర్ పి.సునీల్‌కుమార్, సిబ్బంది కేవీ సత్యనారాయణ, పి.సువర్ణ రాజు, వెంకటేష్, ప్రకాష్, పోసిబాబు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

క్రైస్తవులపై దాడులను అరికట్టాలి


సమావేశంలో మాట్లాడుతున్న హరత్‌బాబు

తణుకు అర్బన్: ప్రస్తుత ప్రభుత్వం ఈ ఏడాది ఫిబ్రవరిలో ఇచ్చిన జీవో వలన ఆంధ్రప్రదేశ్‌లో క్రైస్తవులు అభద్రతాభావానికి గురయ్యారని తణుకు యునైటెడ్ పాస్టర్ల ఫెలోషిప్ గౌరవ అధ్యక్షుడు ఎం.హరత్‌బాబు అన్నారు. క్రైస్తవులపై దాడులను అరికాట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో నేషనల్ క్రిస్టియన్ కౌన్సిల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాస్టర్ ఓ.మనోజ్ బాబ్, తణుకు మండల పాస్టర్ల ఫెలోషిప్ కార్యదర్శి పాస్టర్ కె.బ్లెస్సింగ్ రాజు, ఉపాధ్యక్షుడు పాస్టర్ పి.ఐజాక్ బ్రెన్‌హాం, సహాయ కార్యదర్శి పాస్టర్ కెఎస్ రాజు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవాలి


సమావేశంలో పాల్గొన్న భవన నిర్మాణ కార్మికులు

తాడేపల్లిగూడెం రూరల్: భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు ద్వారా పరిహారాలు అందించాలని ఇఫ్టూ ఉమ్మడి జిల్లా సహాయ కార్యదర్శి మామిడి దానవరప్రసాద్ డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని మోదుగ గుంట గ్రామంలో శ్రీనివాస్ అధ్యక్షతన భవన నిర్మాణ కార్మికుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మామిడి దానవరప్రసాద్ మాట్లాడుతూ ఎన్నికల ముందు భవన నిర్మాణ కార్మికులను ఆదుకుంటామని, గత ప్రభుత్వం చేసిన తప్పులను సరి చేస్తామని చెప్పడమే గాని కార్మికులను ఆదుకోవాలనే ఆలోచన లేదన్నారు. కార్యక్రమంలో కె.శ్రీనివాస్, పోసేంద్ర ప్రసాద్, వీరబాబు, పి.జాన్, రామ్మోహన్, సత్యనారాయణ, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

డాక్టర్ రామకృష్ణ సేవలు అభినందనీయం

తణుకు అర్బన్: తణుకు జిల్లా కేంద్ర ఆసుపత్రి ఆవరణలోని హెచ్ఐవీ రోగులకు సేవలందించే సేఫ్‌కేర్ సెంటర్ వైద్యాధికారిగా పని చేసి ఇటీవల పదవీ విరమణ చేసిన వైద్యుడు డాక్టర్ సుంకవల్లి రామకృష్ణను పలు సంఘాల ఆధ్వర్యంలో గురువారం స్థానిక ఫుడ్ అండ్ ఫన్ హోటల్‌లో ఘనంగా సత్కరించారు.